# కల్పన



విజయవాడ నుండి రాజమండ్రి వెళ్తున్న ఆ ప్యాసింజర్ రైలు ఉంగుటూరు స్టేషన్లో ఆగింది.

చేతిలో సంచీనిండా పట్టినన్ని బట్టలతో కంపార్ట్‌మెంట్ ఎక్కుతున్న ఆమెను ఓ వంద జతకళ్ళు వింతగా పరిశీలించి ఫక్కున రాబోయే నవ్వును ఆపుకున్నాయి.

నల్లని గుండ్రాయిలా ఉన్న ఆమె స్థూల శరీరంపై బెత్తెడు వెడల్పు ఉన్న నెమళ్ళ వెండిజరీ అంచు కాషాయరంగు చీర పెద్ద ఆంజనేయస్వామి విగ్రహానికి చుట్టిన బట్టలా ఉంది. మనిషి లావుగా ఉన్నా చకాచకా రైలు ఎక్కుతున్న ఆమె శరీర భాగాలన్నీ అదురుతూ కనిపిస్తున్నాయి. అదేరంగు మాచింగ్ జాకెట్‌తో నుదుట రూపాయికాసంత ఎర్రని కుంకుమతో కళకళలాడిపోతున్న ఆమెలో నవ్వితే తళుక్కుమని మెరిసే తెల్లని పలువరస చీకట్లోకూడా తన ఉనికిని తెలియచేసేలా ఉంది. రెండు చేతులకి ఎరుపురంగు మట్టిగాజులు నిండుగా ఉన్నాయి.

మెడలో మంగళసూత్రం, మూడుపేటల చంద్రహారాలు, వాటిపైన తళాతళా మెరిసిపోతున్న రంగురంగుల రాళ్ళు పొదిగిన కొత్తిమీరకాడ డిజైన్‌తో చేసిన ఓల్డ్‌మోడల్ నెక్లెస్ పెద్దలనుంచి ఆమెకు సంక్రమించినట్టుగా స్పష్టంగా తెలుస్తోంది.

ఆమెను అనుసరిస్తూ రైలెక్కిన అందమైన యువజంట కూడా మరీ మరీ చూడాలనిపించేలా ఉండడమే, ఆమెను అందరూ వింతగా పరిశీలించడానికి మరో కారణం. వారి కలయిక ఘటవాద్యానికి తోడైన తబలా వాద్యంలా ఉంది.

కంపార్ట్‌మెంట్ ఖాళీగానే ఉంది. ఆషాడమాసం వల్ల కాబోలు. ఆమె కిటికీవైపు త్రీసీటర్లో కూర్చుంది. ఎదురుగా చూడముచ్చటైన ఆ జంట కూర్చున్నారు.

ట్రైన్ కదలడంతో ఆ కుదుపులకు ఒకళ్ళమీద ఒకళ్ళు పడి ఎదుటివాళ్ళు అసూయపడేంత అన్యోన్యతను ప్రదర్శిస్తున్న ఆ జంట చర్య[illegible]మె ఆసక్తికరంగా పరిశీలించసాగింది.

రైలెక్కిన ఒకరిద్దరు చెమట వల్ల తడిసిపోయిన ఆమె ప్రక్క కూర్చోబోయి 'పల్లెటూరు వాసన' భరించలేక కాబోలు లేచి ప్రక్క కూపేలోకి వెళ్ళిపోయారు.

ఆమె నుదుటిమీద ఎర్రని కుంకుమ చెమటకు తడిసి ముక్కుమీదగా కారుతోంటే, శుభ్రంగా నూనె రాసి నొక్కి దువ్వి బిగించివేసుకున్న గిరజాల జుట్టు జడలో ఎర్రని కనకాంబరాల మాలతో శనీశ్వరుడి

